వేదాంతభేరి

సెప్టెంబర్ 2021 రూ. 10/-

వేదాంతభేరి

సెప్టెంబర్ 2021

రూ.10/-

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 54   సెప్టెంబర్ 2021   సంచిక : 09

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె. ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు, ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 2000/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,

స్వామి విద్యాప్రకాశానంద నగర్,

శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)

శ్రీకాళహస్తి, పిన్ - 517640

ఫోన్: 08578-222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ఓం వేదాంతభేరి ఓం

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 54 | సెప్టెంబర్ 2021 | సంచిక : 09

విషయసూచిక

1. ప్రార్థన 5
2. జ్ఞాననేత్రము - శ్రీ విద్యాప్రకానందగిరి స్వాములవారు 6
3. సద్గురుబోధ- శ్రీమలయాళ స్వాములవారు 10
4. పరమహంస సదుపదేశాలు - శ్రీ రామకకృష్ణపరమహంస 11
5. పూజ్యశ్రీ శివానందస్వామువారు సూచించిన సాధన 12
6. సాధనపంచకం - శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు 13
7. సత్యమేవజయతే - శ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు 19
8. శ్రీ శివానందస్వాములవారి సంక్షిప్త జీవిత చరిత్ర 23
9. అన్నమయ్య శరణాగతి - డా॥ సముద్రాల లక్ష్మణయ్య 26
10. వింత గొలుసు - శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారు 30
11. ముణ్డకోపనిషత్తు 31
12. ప్రేయస్సు - శ్రేయస్సు - డా॥ తారాలక్ష్మి 34
13. శ్రీమదాంధ్ర మహాభాగవతం - ఆచార్య జక్కంపూడి మునిరత్నం 38
14. అమృతానుభవం - సంత్ జ్ఞానేశ్వర్ 41
15. వార్తలు 42

ముఖచిత్రం : ప్రణవ గణపతి

8-9-2021 స్వామి శివానన్ద జయన్తి
10-09-2021 వినాయకచవితి
11-09-2021 ఋషి పంచమి
17-09-2021 వామన జయన్తి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

1. ముదాకరాత్త మోదకం సదా విముక్తి సాధకం
కలాధరాఽవతంసకం విలాసిలోకరక్షకమ్ ।
అనాయకైకనాయకం వినాశితేభదైత్యకం
నతాఽశుభాఽఽశునాశకం నమామి తం వినాయకమ్ ॥

2. నతేతరాఽతి భీకరం నవోదితార్కభాస్వరం
నమత్సురారినిర్జరం నతాధికాఽఽపదుద్ధరమ్ ।
సురేశ్వరం నిధీశ్వరం గజేశ్వరం గణేశ్వరం
మహేశ్వరం తమాశ్రయే పరాత్పరం నిరన్తరమ్ ॥

3. సమస్తలోకశంకరం నిరస్తదైత్యకుంజరం
దరేతరోదరం వరం వరేభవక్త్రమక్షరమ్ ।
కృపాకరం క్షమాకరం ముదాకరం యశస్కరం
మనస్కరం నమస్కృతాం నమస్కరోమి భాస్వరమ్ ॥

4. అకించినార్తి మార్జనం చిరన్తనోక్తి భాజనం
పురారి పూర్వనందనం సురారి గర్వచర్వణమ్
ప్రపంచ నాశ భీషణం ధనంజయాధిభూషణం
కపోలదానవారణం భజే పురాణవారణమ్ ॥

5. నితాన్తకాంతదన్తకాన్తి మంతకాంతకాఽఽత్మజం
అచిం్త్యరూప మంతహీనమంతరాయ కృంతనమ్ ।
హృదంతరే నిరంతరం వసంతమేవ యోగినాం
తమేకదన్త మేవ తం విచిన్తయామి సన్తతమ్ ॥

6. మహాగణేశ పంచరత్న మాదరేణ యోఽన్వహం
ప్రజల్పతి ప్రభాతకే హృదిస్మరన్ గణేశ్వరమ్ ।
అరోగతామదోషతాం సుసాహితీం సుపుత్రతాం
సమాహితాయు రష్టభూతి మభ్యుపైతి సోఽచిరాత్ ॥

ఇతి శ్రీ శంకరాచార్య కృత గణేశ పంచరత్నం సంపూర్ణమ్

జ్ఞాననేత్రము

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

భౌతిక పదార్థములవలె జ్ఞాననేత్రము బయట లభించు వస్తువు కాదు. అది లోని వస్తువు. నిత్యానిత్యవివేకమే జ్ఞాననేత్రము. ఆత్మానాత్మ వివేకమే జ్ఞాననేత్రము. పుష్పమాలలో పుష్పములను చర్మనేత్రము చూచుచున్నది. లోని దారమును జ్ఞాన చక్షువు అవలోకించుచున్నది.

ఒకానొక వ్యక్తిని చూచినపుడు శరీరముయొక్క బాహ్య స్వరూపమును అనగా రక్తమాంసమయమగు బాహ్య ఆకృతిని కన్ను చూచుచున్నది. కాని లోన వెలుగుచున్న శాశ్వత పరమాత్మను, దివ్యమగు ఆత్మస్వరూపమును జ్ఞాననేత్రము వీక్షించుచున్నది. భౌతిక నేత్రములకు అగోచరమగు అతిసూక్ష్మమగు అభ్యంతర పదార్థమును తెలిసికొనగలుగు వివేకమే జ్ఞాననేత్రమనబడును.

ఇట్టి జ్ఞాననేత్రముయొక్క ప్రస్తావన ఉపనిషత్తులందు, భగవద్గీత యందు, తదితర శాస్త్ర గ్రంథములందు అచటచట కానిపించుచున్నది. "ఓ జనులారా! ప్రయత్నపూర్వకముగ జ్ఞాననేత్రమును సంపాదించుకొని విశ్వమును సాక్షాత్ భగవత్స్వరూపముగ వీక్షించుచు జీవితములను కడతేర్చుకొనుడు" అని శాస్త్రములందు మహనీయులు ఉద్బోధించుచున్నారు.

ఆవృత్త చక్షురమృతత్వమిచ్ఛన్

అని కఠోపనిషత్తు గంభీరముగ పలుకుచున్నది. అనగా మరణ రహిత ఆత్మస్థితిని బడయదలంచువాడు తన చూపును బయటనుండి లోనికి

త్రిప్పవలసియుండునని భావము. దృష్టిని బాహ్య విషయముల నుండి మఱలించి, అంతర్ముఖ మొనర్చి చక్కగ ధ్యానించునపుడే ఆత్మానుభూతి కలుగగలదని ఉపనిషత్తు పేర్కొనుచున్నది. అట్టి ధ్యానజనిత వివేకమే జ్ఞాననేత్రము. దానిచే చూచునపుడు ప్రపంచమంతయు ఒకే దైవస్వరూపముగ, ఒకే ఆత్మస్వరూపముగ గోచరించును.

'తత్ర కోమోహః కః శోక ఏకత్వమను పశ్యతః'

అచట వైర మెచట? దుఃఖ మెచట? అజ్ఞాన మెచట? అంతయు తానైయుండ ఇక శత్రు మిత్రాది భేదముగాని, స్వకీయ పరకీయ భేదము గాని అచట ఉండనేరదు. "సర్వం ఖల్విదం బ్రహ్మ - నేహ నానాస్తి కించన" - ఈ ప్రపంచమంతయు పరబ్రహ్మ స్వరూపమే. ఇచ్చట అనేకత్వము లేనేలేదు అను ఉపనిషత్సిద్ధాంతము అత్తఱి కార్యాన్విత మగును.

మఱియు జ్ఞాననేత్రముచే వీక్షించునపుడు జడమేదియో, చైతన్య మేదియో, క్షేత్రమేదియో, క్షేత్రజ్ఞుడెవడో, నశ్వరమేదియో, శాశ్వతమేదియో జీవునకు విస్పష్టముగ గోచరించును.

"క్షేత్ర క్షేత్రజ్ఞయోరేవమన్తరం జ్ఞానచక్షుషా" జ్ఞాన చక్షువుచేత క్షేత్ర క్షేత్రజ్ఞుల భేదమును చక్కగ తెలిసికొను జీవుడు పరమాత్మ పదమును బడయ గల్గుచున్నాడని గీతాచార్యులున్ను వచించియున్నారు.

"దృష్టిం జ్ఞానమయీం కృత్వా పశ్యేత్ బ్రహ్మమయం జగత్" "ఓయీ! నీ దృష్టిని జ్ఞానమయముగ నొనర్చుకొని, (జ్ఞాననేత్రమును సంపాదించుకొని) ప్రపంచమునంతను బ్రహ్మమయముగ గాంచుము" అని శ్రీ శంకరభగవత్పాదులు ఉద్ఘోషించిరి.

ఈ ప్రకారముగ ఉపనిషత్తులేమి, భగవద్గీత యేమి, సమస్త శాస్త్రములేమి, శ్రీ శంకరాచార్యాది మహనీయులేమి - ముక్తకంఠముతో

జ్ఞాననేత్రావలంబనమును గూర్చి ఉద్బోధించి యున్నందున దాని నెట్టైన ఈ జీవితములో సాధించి తెచ్చుకొనుట ముముక్షువుల కర్తవ్యమైయున్నది.

ఎఱుపు అద్దములు గల కళ్లజోడు పెట్టుకొని చూచినచో ప్రపంచ మంతయు ఎఱ్ఱగా కనుపించును. నలుపు అద్దములు పెట్టుకొనినచో నల్లగా కనుపించును. తెలుపు అద్దములు పెట్టుకొనినచో తెల్లగా కనిపించును. అట్లే జ్ఞానదృష్టితో వీక్షించినచో సమస్తము బ్రహ్మ మయముగ గోచరించును. అజ్ఞానముచే దృష్టి అపవిత్రమై పోయినందువలన జనులకు ప్రపంచము వక్రముగా కనుపించుచున్నది.

ఆ దృష్టిని శుద్ధపఱచుకొనినచో, గురుశాస్త్రోపదేశములచేతను, స్వానుభవముచేతను వినిర్మల మొనర్చుకొనినచో ప్రపంచము ప్రపంచ రూపమునగాక దైవరూపముగ గోచరమగును. ఇట్టి స్థితిని సాధించుటకే మానవ జన్మ ఏర్పడినది. జ్ఞాననేత్ర సంపాదన కొఱకే మహోన్నతమగు మనుష్యత్వమును భగవానుడు జీవులకు ప్రసాదించిరి. అట్టి మనుష్యత్వమును సార్ధకపఱచుకొనుట ప్రతివానియొక్కయు విధ్యుక్తధర్మము.

అయితే ముందుగా భక్తిని చక్కగ అభివృద్ధి పఱచుకొనవలెను. పూజా జపధ్యానాదుల ద్వారా భగవంతుని లెస్సగ ఉపాసించవలెను. అత్తఱి జీవుల భక్తికి మెచ్చి కరుణామయుడగు పరాత్పరుడు బుద్ధియోగమును వారికి ప్రసాదించును. (దదామి బుద్ధియోగం) ఆ బుద్ధియోగవే జ్ఞాననేత్రము. అదియే దివ్యనేత్రము. అట్టి దివ్యనేత్రముచేతనే అర్జునుడు విశ్వరూపమును చక్కగ చూడగల్గి భగవంతుని సర్వవ్యాపకత్వమును లెస్సగ అవగాహనము చేసికొనగల్గెను.

భక్త్యాత్వనన్యయాశక్య అహమేవంవిధోఽర్జున
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుంచ పరన్తప.

ఆ నేత్రమును ఒక్క అర్జునుడే కాదు, ఎవరైనను పొందవచ్చును. అనన్య భక్తి కలిగియుండిన చాలును - అని శ్రీ కృష్ణ భగవానులు సెలవిచ్చియున్నారు. కాబట్టి అతి సులభమైన భక్తిని జేబట్టి, భగవత్కృపకు పాత్రులై, భగవదనుగ్రహముచే జ్ఞాననేత్రమును బడసి ఏది సత్యమో ఏది అసత్యమో తెలిసికొని, ఏది బింబమో ఏది ప్రతిబింబమో అవగతము చేసికొని, ఏది నిత్యమో ఏది క్షణికమో అనుభూత మొనర్చుకొని, నిత్యమైన ఆత్మయందు మనస్సు నిలిపి క్షణికమైన దృశ్యపదార్ధములందు వ్యామోహమును వదలి నిరతిశయ ఆత్మానందానుభూతిచే జీవితమును చరితార్థ మొనర్చుకొనవలయును.

వేదాన్తభేరి శాశ్వతనిధికి ఈ క్రిందివారు పైకం పంపినారు

1.	జె.మల్లిక (గుంటూరు)	రూ.	3000/-
2.	చెన్నారెడ్డి సునీల (మన్నార్‌పోలూరు)	రూ.	2000/-
3.	పి.నాగభూషణం (నందిపేట)	రూ.	2000/-
4.	ఎ.వసంతమ్మ (చెన్నై)	రూ.	1100/-

వేదాన్తభేరికి ఈక్రిందివారు పోషక చందాపంపినారు

1.	డి.అనసూయమ్మ (వట్లూరు - ఏలూరు)	రూ.	2000/-
2.	దన్నపనేని వెంకట్రావు (ఈదర)	రూ.	2000/-
3.	దన్నపనేని సూర్యవెంకట నరసింహశోభనా చలపతిరావు (ఈదర)	రూ.	2000/-
4.	గోనెల సత్య శశిధర్ (కాకినాడ)	రూ.	2000/-
5.	గౌరా శ్రీనివాస్ (సికింద్రాబాద్)	రూ.	2000/-
6.	జూపూడి శేషగిరిరావు (హైదరాబాద్)	రూ	2000/-
7.	గుమ్మల రమేష్ (విజనయగర్‌కాలనీ, వెంకటాపూర్)	రూ.	2000/-
8.	వి.ఆండాళమ్మ (చెన్నై)	రూ.	2000/-

సద్గురు బోధ

- శ్రీమలయాళ స్వాములవారు

1. విశ్వాసము మానవుని ఊర్ధ్వలోకమునకున్ను, అవిశ్వాసము అధోలోకమునకున్ను గొనిపోవును.
2. సోమరితనము మర్త్యుని నిమ్నస్థితికిని, సోఽహం పరత్వము ఉచ్ఛస్థానములోనికిని ప్రవేశపెట్టును.
3. పురోభివృద్ధిని గోరువారు పూర్వవృత్తాంతమును మరువకూడదు.
4. మనస్సు చేయు చేష్టలనేకాంతముగ కూర్చుండి జాగ్రత్తతో నిరీక్షించుచుండిన మనోజయము త్వరలో సిద్ధించును.
5. ఎవడు విశ్వశాంతిని గోరునో వానికే ఆత్మశాంతి గలుగును.
6. సోదరా! మానవసేవ జేయుట మనుజునికి శ్రేష్ఠధర్మము. అయితే మానవ సేవ చేయుటకు ముందుగా నీవు మానససేవ చక్కగా చేయుము. అట్లైన మాత్రమే నీవు మానవసేవ సరిగా చేయగలవు.
7. సాధువులు సంసారులలో చేరినచో సంసారులను సాధుగుణములు గలవారినిగా చేయవలసినదేగాని, సాధువులు సంసారులుగా మారకూడదను తత్త్వమును సదా జ్ఞప్తిలోనుంచుకొని ప్రవర్తించవలయును.
8. ఇహమందు ప్రాణికోట్లకుపకారము చేయుటయు, పరమునందు పరమాత్మను పొందుటయు మనుష్యజన్మయొక్క లక్ష్యమని మరువకూడదు.
9. లోపలను, బయటను ఈశ్వరుని దర్శించవలసియుండిన మీరు లోపలను బయటను యేకరీతిగా ప్రవర్తించిన చాలును.
10. దీపమునకును, తైలమునకును ఎంత సంబంధమున్నదో ఆహారమునకును, బ్రహ్మచర్యమునకును అంత సంబంధము గలదు.

పరమహంస సదుపదేశములు

- శ్రీ రామకృష్ణ పరమహంస

1. విలువిద్య నేర్చుకొను వ్యక్తి ప్రప్రథమమున పెద్ద పెద్ద వస్తువులపై గురి నిలుపుచు, తదుపరి చిన్న వస్తువులపై కూడ గురి నిలుపగలుగును. అటులనే మొదట భగవంతుని సగుణ ధ్యానము నందు మనస్సును లగ్నము చేసినచో పిదప పరమాత్మ యొక్క నిర్గుణ ధ్యానమును చేయుట సులభమగును.
2. ఒక పెద్ద కలపమొద్దు జలప్రవాహములో కొట్టుకొని పోవుచున్నపుడు అనేకులు దాని నాశ్రయించి రక్షింపబడుదురు. కాని ఒక రెమ్మ ప్రవాహమందు కొట్టుకొని పోవునపుడు ఒక చిన్న పక్షి దాని మీద కూర్చున్నను అది మునిగిపోవును. ఈలాగుననే భగవానుడు అవతరించినపుడు పలువురు వారి అనుగ్రహ ప్రభావముచే తరింతురు. కాని సామాన్య సిద్ధజీవులు తమ్ము తామే రక్షించుకొనగలిగియుందురు.
3. హోమపక్షి ఎల్లప్పుడు ఆకాశమందే మిక్కిలి ఎత్తులో ఎగురుచుండును. అది ఆకాశమందే గ్రుడ్లను పెట్టును. ఆ గ్రుడ్లు నేలపై పడుచుండగ మార్గమధ్యమందే పిల్లలుగా మారుచున్నవి. తాము క్రిందకు పడిపోవుచుంటిమని తెలుసుకొని పైకి ఎగిరిపోయి తమ తల్లిని చేరును. ఆలాగుననే శ్రీ శుకదేవుడు, శంకరాచార్యులు, నారదుడు మొదలగు మహనీయులు బాల్యకాలమందే ఈ లోకము శాశ్వతము కాదని గ్రహించి, శాశ్వతమైన బ్రహ్మలోకమును (పరమాత్మను) చేరి పరమానందమనుభవించుచున్నారు.
4. ఆత్మసాక్షాత్కారమును అభిలషించువాడు మనస్సును, వాక్కును, ఆచరణను పరిశుద్ధముగ ఉంచుకొనవలెను. మనుజుడు త్రికరణ శుద్ధి కలిగి దైవధ్యానాదులను సలుపుచు, ఆత్మసాక్షాత్కారమును బడసి జీవన్ముక్తుడై విలసిల్లవలెను.

పూజ్యశ్రీ స్వామి శివానందులవారు సూచించిన సాధనా విధానము

మానవ జీవిత అంతిమలక్ష్యము ఆత్మసాక్షాత్కారమని, మానవునిలో దివ్యత్వము అంతర్లీనంగా కలదని, దానిని వెలికితీయుటకు శరీరము, మనస్సులను తగువిధముగా ఉపయోగించుకొని సాధనచేసిన యెడల ప్రతి ఒక్కరు ఆత్మసాక్షాత్కారమును బడయగలుగుదురని తెలిపి, సద్గురు స్వామి శివానందవారు ఆరు అంశాలతో కూడిన సందేశాన్ని మానవాళికి అందించారు. అవి :-

1. సేవింపుము :- సేవ వలన మనస్సు పరిశుద్ధమై అహంకారము తగ్గిపోతుంది. సర్వజీవరాసులలోను పరమాత్మను దర్శిస్తూ, సర్వజీవరాసులను ఆత్మభావనతో సేవచేయాలని ఆయన ఉద్దేశ్యము. ఆకలిగొన్నవానికి అన్నం పెట్టడం, దుస్తులు లేనివారికి వాటిని అందించడం, రోగులకు తగు సేవలందించడం, విద్య లేనివారికి విద్యనందించడం, సర్వజీవరాశులు సుఖశాంతులతో మెలగాలని మనసా వాచా కర్మణా వాంఛించడం - ఇవి అన్నియు సేవావిభాగాలేనని సద్గురువులు చెబుతారు. మనం ఇతరులకు సేవ చేశామన్న గర్వం కన్నా వారు మనకు సేవచేసే అవకాశాన్ని ఇచ్చినందులకు కృతజ్ఞతతో మెలగాలని వారు చెబుతారు.

2. ప్రేమించుము :- ప్రేమయే పరమాత్మ, పరమాత్మయే ప్రేమ. ప్రేమకు ఐక్యతను కలిగించే శక్తివుంది. ఇతరులపట్ల ప్రేమ, సద్భావన కలిగిన ఒక్క ఆలోచన అయినా అది ఆశ్చర్యకరంగా పనిచేస్తుంది. ప్రేమతో చూచిన ఒక్క చూపు బాధను, దుఃఖాన్ని దూరం చేస్తుంది. దయతో, ప్రేమతో మాట్లాడిన ఒక్క పలుకు ఔషధం కన్నా ఎక్కువ పనిచేస్తుంది. హృదయానికి కలిగిన అన్ని గాయాలను ప్రేమ నయం చేస్తుంది. ప్రేమ ప్రతిఫలాన్ని కోరదు. ప్రేమకు భయం వుండదు. ప్రేమ ఎప్పుడును చెడును కోరదు.

ప్రేమించడం అంటే పంచుకోవడం, సేవించడం. ప్రేమ శాంతిని, సంతోషాన్ని ఇస్తుంది. ప్రేమ మనిషిలోని భావాలను అనుకూలత వైపు పయనించేలా చేస్తుంది. సర్వ జీవరాశులపట్ల ప్రేమభావం భగవత్సాక్షాత్కారానికి దారితీస్తుంది.

3. దానము చేయుము :- ఉదారభావన మానవహృదయాన్ని విశాల పరుస్తుంది. అది అధ్యాత్మిక ప్రగతికి దోహదం చేస్తుంది. నీ ఆదాయానికి అనుకూలంగా దానం చేయాలని అన్ని మతాలు ప్రబోధిస్తాయి. మనం చేసిన దానానికి ఎన్నోరెట్లు మనకు అవసరం ఉన్నప్పుడు అందుతుందని సద్గురువులు చెబుతారు. ధనాన్నే కాక, దేనినైనా ఇతరులతో పంచుకొనవచ్చును, పంచుకోవడం వలన శాంతి, సంతోషం కలుగుతాయి. స్వార్థం నశిస్తుంది. విశ్వప్రేమ ఉద్భవిస్తుంది. ఇవ్వడమనేది కార్యరూపములో అభివ్యక్తం చేసే ప్రేమయే!

4. పవిత్రంగా ఉండుము :- శారీరకంగా, మానసికంగా, బౌద్ధికంగా నిర్మలముగా ఉండి కర్మలనాచరించాలి. అది మానవుని జీవితాన్ని సరళముగా మార్చి, ఆధ్యాత్మికసాధనను తీవ్రతరం చేస్తుంది. నామస్మరణ వలన, పరమాత్మ సంకల్పానికి సంపూర్ణ శరణాగతి నొందియుండుటవలన మనస్సు, ఆలోచన పరిశుద్ధమౌతాయి. అది కామం, అత్యాశ నుండి స్వేచ్ఛను కల్పించి, తన నిజస్వభావాన్ని గుర్తించేలా చేస్తుంది. గురువు పర్యవేక్షణలో శాస్త్రాధ్యయనము, మహాత్ములతో సత్సంగము వలన వాసనలు నశించి, మనస్సు శుద్ధమౌతుంది. నిష్కామ కర్మయోగం, ఉపాసన ద్వారా కూడా పవిత్రతను సాధించవచ్చు.

5. ధ్యానించుము :- ఒక వస్తువు లేదా ఇష్టదైవము లేదా పరమాత్మపై సాగించే నిరంతర ఆలోచనాప్రవాహమే ధ్యానము. ఇది సగుణమైనా కావచ్చు, లేదా నిర్గుణమైనా కావచ్చు. నిస్స్వార్థసేవ, నిష్కళంకమైన ప్రేమ, దానగుణమును కలిగియుండుట, అహంకారత్యాగము, బహిర్ముఖమగుచున్న

ఇంద్రియాలను నియంత్రించడం (వాసనాక్షయము) ద్వారా మనోబుద్ధులు పవిత్రమైనప్పుడు మాత్రమే ధ్యానము సాధ్యమగును. ప్రతిదినం ఇతరులచే ఆటంకం కలుగని ఒకే గదిలో ఒకే స్థలములో ఒకే కాలములో ధ్యానం చేస్తే ప్రగతి కనిపిస్తుంది. మనోస్వచ్ఛతకు, ధ్యానానికి పరస్పర అనుబంధం ఉంది. ధ్యానం వలన మనస్సు శుద్ధమౌతుంది. ప్రతి మనిషి అనుకూలమున్నంత సమయం క్రమం తప్పక ధ్యానసాధన చేయాలి. ఇది సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది.

6. ఆత్మసాక్షాత్కృతిని పొందుము :- ప్రతి వ్యక్తి ఆత్మస్వరూపుడు, అతడు పరమాత్మ అంశము. ఈ విషయాన్ని అతడు విస్మరించినాడు. 'దేహమే నేను' అనే భావనతో ఉంటున్నాడు. తనలోని మాలిన్యాలను నిర్మూలించుకొని, ఒకే అంశంపై ఏకాగ్రత అలవరచుకొన్న తరువాత మాత్రమే అతడు ఆత్మసాక్షాత్కార సాధనకు అర్హుడౌతాడు. ఈ దశలో అతడు భగవత్ చైతన్యంలో లీనమై, బాహ్యాభ్యంతరాలలో దివ్యత్వాన్ని అనుభవిస్తాడు. వ్యక్తిత్వం అంతర్ధానమై సర్వాంతర్యామి, అవినాశి అయిన ఆ దివ్యత్వంలోనికి అడుగిడుతాడు. ఈ పవిత్ర సాధనయే ధ్యానము. అప్పుడతడు 'అయమాత్మా బ్రహ్మ' అనే భావనలో ఉంటాడు. ఆ స్థితిలో శారీరక కార్యక్రమాలు జరుగుతూవున్నా నిరంతర ధ్యాన ప్రక్రియ కొనసాగుతూనేవుంటుంది.

సద్గురుదేవులు "మంచిగా ఉండుము, మంచిని చేయుము" అని అంటారు. 'మంచిని చేయుట' అంటే 'సేవించుట, దానం చేయుట' అని అర్థము. 'మంచిగా ఉండుము' అంటే 'పవిత్రంగా ఉండుము, ధ్యానింపుము, ఆత్మసాక్షాత్కారమును బడయుము" అని అర్థము. ఇదియే! గురుదేవులు చెప్పే "బి గుడ్, డు గుడ్" అనువాటి అంతరార్థము.

గురుదేవుల ఈ ఉపదేశాలు దివ్యజీవనానికి దారితీస్తాయి, దివ్యజీవనాన్ని గడపడం వలన మానవ సమాజం శాంతిసౌఖ్యాలతో వెలుగొందుతుంది.

సాధన పంచకము

- శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

(గత సంచిక తరువాయి)

ప్రారబ్ధం త్విహభుజ్యతామ్

ఇహ - ఈ లోకంలో ప్రారబ్ధమైతే అనుభవింపబడవలెను. ప్రారబ్ధ కర్మ యనగా - "వర్తమాన శరీరారంభకర్మ ప్రారబ్ధమ్" మానవుడు గర్భవాసంలో నున్నప్పటి నుండి మరల జన్మించినది మొదలుకొని మరణపర్యంతము వరకు శరీరయాత్రను ప్రారబ్ధ మందురు. "ప్రారబ్ధ కార్యం సుఖదుఃఖాది రూపం అనుభోక్తవ్యమ్" శరీరం ద్వారా, మనస్సు ద్వారా సుఖదుఃఖముల భోగము ననుభవించుటయే ప్రారబ్ధమనబడును. సంచితమునుండి వర్తమాన దేహమునకు కారణముగా నుండెడి కర్మను ప్రారబ్ధమందురు.

సంచితము, ఆగామి కర్మఫలములు ఆత్మ జ్ఞానమువలన నష్టమగును. ప్రారబ్ధ కర్మ ఫలం ఆత్మజ్ఞానము వలన నష్టం కాదు. అనుభముతోనే నష్టమగును. కనుకనే "అవశ్యమనుభోక్తవ్యమ్" ప్రారబ్ధం భోగతో నశ్యేత్" ఇత్యాది శాస్త్ర వాక్యముల వలన, అనుభవంతో దినదినమునకు ప్రారబ్ధము నష్టమగుచుండును. ప్రారబ్ధమనేది కేవల సుఖదుఃఖ భోగములకేగాని, భక్తి, జ్ఞానములకు ప్రారబ్ధ సంబంధమే లేదు. నా ప్రారబ్ధములో భక్తి జ్ఞానములు లేవు అందుచే నాకు ఈ జన్మలో భక్తి జ్ఞానములు అలవడవు అనే మాటలు కేవలము విభ్రమణమే గాని వేరుగాదు. భక్తి జ్ఞాన యోగ వైరాగ్యాదులు ప్రయత్నపూర్వకముగా సంపాదించుటకు యోగ్యమైనదీ మానవ జన్మ. కావున "జంతూనాం నరజన్మ దుర్లభమ్" అన్నారు శ్రీ ఆచార్యులవారు.

విడువబడిన బాణము, ఉపసంహరింప సాధ్యముగానటుల ప్రారబ్ధకర్మనుదాటుట కెవరికిని సాధ్యము గాదు. ఒక విలుకాడు పులి

యను తలంపుతో తీవ్రముగా బాణము విడిచెను. కొంత సమయం తరువాత గోవు యను బుద్ధి నిశ్చయమాయెను. ఇపుడా బాణముగాను ఉపసంహరించుట కవకాశము లేదు. ఈ విధముగా ప్రారబ్ధకర్మ ఫలం తప్పక అనుభవించ వలెను.

అగ్నిని తెలిసి పట్టుకున్నా, తెలియకపట్టుకొన్నను మనుష్యుని చేయిని కాల్చినట్లు, తెలిసి, తెలియక చేసిన అధర్మ ప్రవృత్తి వలన గలుగు పాపఫలమును తప్పకయనుభవించవలెను. దశరథమహారాజు రాత్రి యందు ఏనుగు జలపానమునకై వచ్చినదని భావించి బాణమును ప్రయోగించెను. అది ఋషికుమారునికి తగిలి అతడు మరణించెను. ఈ పాపకర్మ తెలియక చేయబడినది. శ్రీరాములు వారు చెట్టు చాటున వాలిని సంహరించినందుచే శ్రీకృష్ణావతారమున వ్యాధునిచే కొట్టబడి మృతి చెందెను అని పురాణములు చెపుచున్నవి. ఇదియు బుద్ధి పూర్వకముగా చేయబడిన కర్మయని తెలియవలెను. పాండురాజు, అరణ్యమున మృగరూపులై మునులు విహరించుచుండ వారిని మృగములని బాణముచేకొట్టెను. అందుచే మునుల శాపమునకు గురి అయ్యెను. ఈవిధముగా కర్మ బలిమిని తెలియవలెను. "అవశ్యమేవ భోక్తవ్యం కృతం కర్మ శుభాశుభం । కృతకర్మ క్షయో నాస్తి కల్ప కోటి శతైరపి"॥ చేయబడిన కర్మ ఫలమునకు కోటి కల్పముల కయినను నాశము లేదు. ఆ ఫలం పుణ్యమైనను పాపమైనను అనుభవించి తీరాల్సిందే. ప్రారబ్ధ మనగా ప్రయోగింపబడిన బాణము. అవశ్య ఫలగామి. ఆగామి యనగా చేతిలోలేని బాణము, తనకు ఇష్టముండిన దానిని ప్రయోగం చేయలేదు. సంచితమనగా అమ్ముల పొదిలో నుండు బాణములు. వీనిని దూరముగా పారవేయవచ్చును. గీత 4-12 క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా" ఈ మానవలోకంలో శీఘ్రముగా చేసిన కర్మలకు ఫలం సిద్ధించును. కనుక మానవుడు చేయదగిన పనులనే చేయవలెను. తినదగినదే తినవలెను. త్రాగదగినదే

త్రాగవలెను. ఈవిధముగా విహిత కర్మము నాచరింపవలెను. అనుభవముతో ప్రారబ్ధం నశించును. తత్వజ్ఞానముచే సంచిత ఆగామి కర్మఫలములు నశించును. జీవించి యుండగనే ముక్తుడగును. ఇతనికి మరల జన్మ లేదు 'న స పున రావర్తతే' అని బ్రహ్మసూత్రము. ఈవిధముగా 39వ సాధనను శ్రీ ఆచార్యులవారు దెలిపిరి.

అథ పరబ్రహ్మాత్మనా స్థీయతామ్

ఆగామి సంచితములు ఆత్మ జ్ఞానముచే నష్టము కాగా అనంతరము తాను పరబ్రహ్మ స్వరూపముగా భావింపబడవలెను. అథ శబ్దమునకనేకార్థములున్నవి. "మంగళానంతరారంభ ప్రశ్న కార్త్స్న్యేష్వథో అథ" అను నిఘంటువు ననుసరించి అథ శబ్దమునకు సయితము మంగళము, అనంతరము, ఆరంభము, ప్రశ్నము, సర్వము అను నైదర్థములుండగా నిచ్చట మాత్రము అనంతరరూపార్థమే గ్రహింపబడినది. ఈ సాధనతో అనంతరమనగా - సాధన చతుష్టయ సంపత్తి బాగుగా శీలించి, శ్రోత్రియ బ్రహ్మమును గురించి శ్రవణము చేసిన అనంతరం. తత్ఫలితముగా "అహం బ్రహ్మాస్మి, బ్రహ్మైవాహమస్మి" అని బాగుగా మననము చేసి దృఢాపరోక్షజ్ఞానమును పొందవలెను. తత్త్వమసి మహావాక్య శ్రవణానంతరము అని అర్థము. బ్రహ్మజ్ఞానముచే జన్మకు హేతువులగు కర్మఫలములు నష్టమగును. శరీరమున్నంతవరకు స్వాత్మయందే క్రీడించుచూ, స్వాత్మ చేతనే సంతృప్తుడగుచు, స్వాత్మానందమునందే యుండును. దేహాత్మభావమనే అజ్ఞానము సర్వనాశమగును. స్వాత్మ జ్ఞానముచే నిస్సంగ పరమాత్మ స్వరూపుడగు ముక్తాత్మునకు కర్తవ్యము లేదు. ఇహలోక, పరలోకములందును తాజేయదగిన కార్యమేదియును లేదు. సర్వ కర్మలు నశించినవాడే బ్రహ్మజ్ఞానియని అర్థము. కర్తవ్యము లేనందుచే నా మహనీయుడు ఈలోకములోనే ముక్తుడై, సమదర్శియై పరిపూర్ణ పరబ్రహ్మ మగుచున్నాడు. "సర్వం ఖల్విదం బ్రహ్మ" యను భావములో స్థితుడై

యుండును. ఈ విధముగా సాధకుడుండవలెనని సాధన పంచకములో చివరి సాధనైన 40వ సాధనను శ్రీశంకరాచార్యుల వారు బోధించిరి.

ఫల శ్లోకము

యః శ్లోకపంచక మిదం పఠతే మనుష్యః
సంచిన్తయంత్యనుదినం స్థిరతా ముపేత్య ।
తస్యాశు సంస్కృతి దవానల తీవ్రఘోర
తాపః ప్రశాన్తి ముపయాతి చితిప్రభావాత్ ॥

ఏ మానవుడు స్థిరబుద్ధి గలవాడై ఈ యైదు శ్లోకములను ప్రతిదినం శ్రద్ధతో పఠించునో, మరియు సమగ్రముగా విచారించి మననము చేయునో, అట్టి సాధకుడు, జన్మజరామృత్యు ప్రవాహరూపమగు సంసారమునుండి తరించుచున్నాడు. ఆత్మజ్ఞాన ప్రభావముచేత ప్రశాంతిని పొందుచున్నాడు అని భావము. కావున మానవులైన స్త్రీలు గాని, పురుషులు గాని, వృద్ధులుగాని, యౌవనవంతులుగాని, బ్రాహ్మణులుగాని, బ్రాహ్మణేతరులగు ఏ వర్ణ, కులములకు చెందినవారు గాని అందరూ ఈ గ్రంథమును చదువుటకర్హులే. “యః” అని శ్రీఆచార్యులవారు శ్లోక ప్రారంభములోనే చెప్పియున్నారు. యః మనుష్యః - మానవుడెవడైనను దీనిని చదివి, అర్థముచేసుకొని ఆచరించి ఇహలోకంలో శాంతిని పొంది, ధర్మార్థ కామములను పొంది ఆత్మ విచారణతో మోక్షమును పొందును అని చెప్పియున్నారు. కావున మానవులు కర్తవ్యకర్మల, ఉద్యోగ వ్యాపార, వ్యవసాయాదులను నిర్వర్తిస్తూ, ప్రతిదినము పది నిమిషములు చదివితే చాలును. తాత్పర్యము చదువవలెను. అందరికి శుభములు చేకూరును.

ఇతి శ్రీమచ్ఛంకరాచార్య విరచితం సాధన పంచకం సమాప్తము
ఓం లోకాస్సమస్తాః సుఖినో భవంతు
ఓం శాంతి శ్శాన్తి శ్శాన్తిః
ఓం తత్సత్ ఓమ్.

సత్యమేవ జయతే

శ్రీ సర్వాత్మానందగిరిస్వాములవారు

“సత్యం వద ధర్మం చర...” అని ఉపనిషద్వాక్యము. దీని అర్థము సత్యాన్ని పలుకు ధర్మాన్ని ఆచరించు అని. అట్లాగే “సత్యమేవ జయతే” అంటే సత్యము మాత్రమే జయిస్తుంది అని అర్థము. ఈ ఉత్తమ సందేశాన్ని అందరికీ తెలియపరచాలనే భారత ప్రభుత్వపు చిహ్నమైన అశోకచక్రము గుర్తు క్రింద ప్రతి రూపాయి నాణెము, నోటు మీద ముద్రించబడింది.

చూచింది చూచినట్లు, విన్నది విన్నట్లు, జరిగింది జరిగినట్లు తెలపడమే సత్యము అని ప్రసిద్ధమైన లోకభావన. అంటే సామాన్యులందరూ అనుకునేది అని. ఐతే, ఒకే విషయమును ఒకరు ఒకవిధంగానూ మరొకరు మరొకవిధంగానూ, వారి వారి దృష్టినీ, శ్రవణాన్నీ, ఆసక్తినీ, మానసిక స్థితినీ అనుసరించి అనేక విధాలుగా గ్రహించవచ్చును. అందరూ ఒకే విధంగా గ్రహిస్తారు, గ్రహించాలి అన్న నియమమేదీ లేదు. అందుచేత ఒకే విషయాన్ని గురించి పలువురు చెప్పినప్పుడు దాంట్లో ఏది సత్యము, ఏది అసత్యము అని నిర్ణయించడము సులభమైన పని కాదు. అట్లాగని వారి వారి భావనలలో సత్యముగా తలిచి తెలిపినదాన్ని అసత్యము అని చెప్పడానికి గూడా వీలుపడదు. ఉదాహరణకు - చాలా జ్వరముతో వున్నవాడికి మహారుచికరమైన ఆహారము గూడా చేదుగా వుంటుంది. మెల్ల కంటి వాడికి వస్తువులు రెండుగా కనబడతాయి, జలుబు చేసినవాడికి వాసన తెలియదు, కంటిచూపు మందగించిన వాడికి దృశ్యాలు స్పష్టంగా కనబడవు, చెవిటివాడికి శబ్దాలు యథాతథంగా వినబడవు. అందుచేత ఉద్దేశ్యపూర్వకంగా కాకపోయినా గూడా అనేక ప్రతిబంధకాల వలన సత్యాన్ని తెలియబరచడమనేది జనులకు సాధ్యపడదు గదా!

ఇంతేగాక సత్యాలుగా కనిపించే మరికొన్ని అసత్యాలు ప్రపంచానుభవంలో గమనించవచ్చును. ప్రతి దినమూ సూర్యుడు తూర్పు దిశ నుండి పడమటి దిశకు ప్రయాణించడాన్ని అందరూ చూస్తూనే వున్నారు. సామాన్యులు దాన్ని సత్యమనే భావిస్తారు, ఆవిధంగానే చెబుతారు. ఐతే కాస్త సామాన్య శాస్త్రపరిచయము కలవారికి మాత్రము అది అసత్యమే గదా! దూరంగా కనిపించే కొండలు చాలా నునుపుగా వుంటాయి. కర్రను సగము నీటిలో ముంచితే అది వంకర తిరిగినట్టు కనబడుతుంది. ఆకాశములో ప్రయాణిస్తున్న విమానము భూమిపై నున్నవారికి చిన్న పక్షిలాగా కనబడుతుంది. దుఃఖములో మునిగి వున్నవాడికి ప్రపంచము దుఃఖమయంగానూ, ఆనందంగా వున్నవాడికి అది ఆనందంగాను వుంటుంది. ఒకే కన్య ఒకరికి అందంగానూ మరొకనికి అందం లేనిదిగాను కనబడుతుంది. ఒకే పాట, ఒకే వాసన, ఒకే రుచి, ఒకే వాతావరణము కొందరికి చాలా బాగున్నట్లు మరికొందరికి బాగాలేనట్లు గాను అనిపిస్తాయి. మరి ఎవరి మాట, భావన సత్యము అన్నది నిర్ణయించ లేము.

ప్రసిద్ధమైన మరొక అనుభవము - మనిషి నిద్రించి స్వప్నావస్థలో వున్నప్పుడు, ఆ స్వప్నంలోని విషయాలూ అనుభవాలు అన్నీ గూడ అప్పుడు పూర్ణ సత్యాలుగానే వుంటాయి, కానీ మెలకువ రాగానే అన్నీ అసత్యాలైపోతాయి. కాబట్టి తీవ్రంగా విచారించవలసిన విషయమేమిటంటే - జాగ్రత్తు ప్రపంచము సత్యమా? లేక స్వప్న ప్రపంచము సత్యమా? లేక రెండూ సత్యాలేనా? లేక రెండూ అసత్యాలేనా? అన్నవి.

ఈ తెలుపబడిన విషయాల వంటి అన్నిటికి గూడా "సాపేక్షక సత్యాలు" అని పేరు - అంటే ఈ సత్యాలన్నీ దేశ కాల వస్తు వ్యక్తిస్వభావ పరిస్థితి మొదలైన వాటి మీద ఆధారపడినవి అని భావము. అందు చేత ఇవన్నీ ఆత్యంతిక, నిరపేక్షమైన సత్యాలు కావు, ఆయా

సందర్భాలను అనుసరించి సత్యాలు అని భావము. వీటన్నిటినీ మనిషి యొక్క మనసే కల్పించింది అంటే మనసే వీటికి కారణము అని.

ఐతే నిరపేక్షకమైన సత్యము వుందా? - వున్నది. సత్యమనే శబ్దానికి నిర్వచనమును వేదాంతశాస్త్రము స్పష్టంగా తెలిపింది. "త్రికాలాబాధ్యం - సత్యం" అంటే భూత వర్తమాన భవిష్యత్తులు అనే మూడు కాలాల్లో గూడా ఎటువంటి వికారము అంటే మార్పు లేకుండా వున్నదే సత్యము అని అర్థము. భూతకాలమంటే ఈ విశ్వము పుట్టక పూర్వమనీ, వర్తమానమంటే విశ్వమున్న సమయమనీ, భవిష్యత్తు అంటే విశ్వము అంతమైపోయిన తరువాత అనీ అర్థము. ఆ విధమైన వస్తువే 'ఆత్మ' పరమాత్మ, బ్రహ్మము, సత్ అనే పేర్లతో చెప్పబడింది. ఈ ఆత్మనే అనేక రూపాలలో, అంటే కాలము, ప్రకృతి, త్రిగుణాలు, మహత్తత్త్వము, అహంకారము, పంచభూతాలు వీటన్నిటి పరస్పర మేళనము (కలయిక) వలన కలిగిన సకల చరాచరాత్మకమైన ఈ విశ్వముగా వ్యక్తి మనసు చేత చూడబడుతున్నది. వీటన్నిటికీ ఆత్మనే ఉపాదాన కారణము (ముడి పదార్థము). సువర్ణముతో చేయబడిన కంకణాలు, కుండలాలు, ఉంగరాలు, గొలుసులు, పతకాలు, పాత్రలు ఇత్యాదుల రూపాలలో ఉన్నది కేవల సువర్ణమే గదా! ఆ విధంగా అని భావము.

"వాచారంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యం" అన్నది ఉపనిషత్తు - కుండలు, ఇటుకలు, కలశాలు, ప్రమిదలు, మూకుళ్ళు ఇత్యాది పేర్లతో వున్నది ఒకే ఒక మట్టియే అని అర్థము. తాత్కాలికమైన ఈ రూపాలు, వాటి నామాలన్నీ కాలాంతరంలో నశించిపోయి తిరిగి మట్టిలో కలిసిపోతాయి. అదేవిధంగా ఈనాటి అసంఖ్యాకమైన ప్లాస్టిక్కు వస్తువులన్నీ ప్లాస్టిక్కే గదా!

"బ్రహ్మ సత్యం జగన్మిథ్య ..." అనే ఉపదేశంలోని ప్రపంచము సత్యము కాదు అన్న విషయాని కొస్తే - లక్షలాది రూపాలలో గల ఈ

ప్రపంచము జీవి మనుగడకు, మనసు యొక్క అవిద్యవలన, ప్రారబ్ధానుభవాని కొరకు ఏర్పడింది. ఇది వ్యావహారిక సత్యము అని చెప్పబడింది. సత్యముగా కనిపిస్తున్న ఈ ప్రపంచము యొక్క సత్యమైన రూపము బ్రహ్మ మాత్రమే అన్నదే పరమ సత్యము. అందుచేతనే పరమాత్మ "సత్యస్య సత్యం" అని చెప్పబడింది.

ఎంతవరకు మనిషి బ్రహ్మవేత్తల సేవ శుశ్రూషాదులు చేసి వారి బోధను శ్రవణ మనన నిధి ధ్యాసలతో అనుభవానికి తెచ్చుకుని తన అవిద్యను తొలగించుకోడో అంతవరకు అసత్యమైన ప్రాపంచిక విషయాశాసుడిగుండము నుండి బయటపడలేక జనన మరణ చక్రంలో తిరుగుతూ అపార శ్రమను చేసి సత్యమైన తన స్థితిని మనిషి చేరుకున్నప్పుడే జనన మరణ చక్రాన్ని నాశనం చేసి నిర్విషయానందాన్ని పొందుతాడు, అంటే ఆనందమే తానుగా వుంటాడు. అంటే తనకు సంసారాన్ని కల్పించిన మాయను జయించాడు అని భావము. కల్పితమైన ప్రపంచంలోని సకల జయాల వల్ల గూడా జీవికి సంసార బంధము నశించదు, ఆ జయాలన్నీ గూడా తాత్కాలికమైన సంతోషాలనే కలిగిస్తాయి. సత్యమైన ఆత్మ స్థితే శాశ్వత నిరతిశయ ఆనందాన్ని ఇస్తుంది కాబట్టే "సత్యమేవ జయతే" - సత్యములోనున్నవాడే జయిస్తాడు అని చెప్పబడింది.

త్రినేత్రవైద్యాలయ ట్రస్టునిధికి ఈక్రిందివారు పైకం పంపినారు

1. వి.దేవేంద్రప్ప (బళ్ళారి) - రూ. 25000/-
2. గంగాప్రకాశ్ (వర్నీ-నిజామాబాద్ జిల్లా) రూ. 80610/-

సద్గురు సర్వసేవాట్రస్టు నిధికి ఈ క్రిందివారు పైకం ఇచ్చినారు

1. డా॥ ఎ.తారాలక్ష్మి (ఇంగ్లీషు లెక్చరర్, నాయుడుపేట)రూ. 25000/-
2. అత్యం వెంకటాచలం (పెనుగొండ-ప.గో.జిల్లా)రూ. 20999/-
3. ఐ.రవికుమార్ & రమాదేవి (హైదరాబాద్) రూ. 11000/-

శ్రీస్వామి శివానంద సరస్వతి సంక్షిప్త జీవిత చరిత్ర

(పూజ్యశ్రీ శివానంద సరస్వతి స్వాముల వారి 134వ జన్మదిన సందర్భంగా)

భారతావనిలో దేవభూమి అనబడే ఋషీకేశ్ నందు దివ్యజీవన సంఘము (ది డివైన్ లైఫ్ సొసైటీ) అనే ఆధ్యాత్మిక సంస్థను స్థాపించి, యావత్ప్రపంచము నందలి మానవాళికి మానవ జీవిత లక్ష్యాన్ని తెలిపి, నిజమైన ఆధ్యాత్మిక జీవితాన్ని ఎట్లు ఆచరించి, ఆస్వాదించాలో తెలియజెప్పిన మహాపురుషుడు స్వామి శివానంద సరస్వతి. ఆయన జీవిత విశేషాలను, మానవులకు ఆయన అందించిన ఆధ్యాత్మిక సాధనా అంశాలను గూర్చి సంక్షిప్తంగానైనా తెలుసు కొనాలనెడి జిజ్ఞాస భక్తులకు కలగడం సహజం. ఈయన అప్పయ్యదీక్షితార్ వంశములో వెంగుఅయ్యర్, పార్వతి అమ్మాళ్ పుణ్య దంపతులకు తమిళనాడులోని పట్టమడై గ్రామములో 8.9.1887లో భరణి నక్షత్రమునందు జన్మించినారు. చిన్నతనంలో వారి పేరు కుప్పుస్వామి. తెలివైన విద్యార్థిగా ఉంటూ, వైద్యపట్టాను పొంది, మలేషియా దేశం వెళ్ళి, అక్కడ ఒక పెద్ద ఆసుపత్రి యందు పేదలకు వైద్యముచేయుచు, మంచి పేరుప్రఖ్యాతులను గడించారు. మానవుల యందే దేవుని చూస్తూ ఆయన తన వైద్యవృత్తిని నిర్వర్తించేవారు.

'జీవబ్రహ్మైక్య రాజయోగ రహస్యము' అనెడి ఆధ్యాత్మిక గ్రంథమును ఆయన చదువగా, ఆయనలోని వైరాగ్యము విప్పారి, మానవుడు నిరంతర ఆనందము నొందు మార్గమునన్వేషించాలనే తపనతో ఋషీకేశ్ చేరి, అచ్చటి ఆశ్రమాలలో భిక్షను స్వీకరిస్తూ, అచ్చట సాధుసత్పురుషులకు, ప్రజలకు వైద్య సేవలందిస్తూ, వారికి ఆధ్యాత్మిక గ్రంథాలలోని ముఖ్య విషయాలను ప్రబోధించుచు సాధన చేసెడివారు. క్రమశిక్షణా యుతమైన జీవితానికి, శ్రద్ధ-నిష్ఠ తోడుకాగా

ఆయన తపస్సుతో శ్రీకృష్ణ దర్శనభాగ్యమును బడసెను. 1.6.1924లో స్వామి విశ్వానందవారి నుండి సన్న్యాసదీక్షను పొంది, కుప్పుస్వామివారు సరస్వతీ సంప్రదాయములో 'స్వామి శివానంద సరస్వతి' అయినారు.

భక్తుల సౌకర్యార్థమై ఆయన ఋషీకేశ్‌లో గంగానది ఒడ్డున 'శివానందాశ్రమము'ను స్థాపించి, జనులకు ఆధ్యాత్మిక మార్గములో దిశానిర్దేశము గావించు 'దివ్యజీవన సంఘము'ను 1936వ సంవత్సరములో స్థాపించిరి. సేవ, ప్రేమ, దాతృత్వము, పవిత్రత, ధ్యానము, ఆత్మ సాక్షాత్కారము - అనేవి ఈ సంఘపు లక్ష్యములు.

స్వామి శివానందవారు ఏ మతావలంబీకులైనా అతి సామాన్యులు కూడ భగవత్సాక్షాత్కారమునకు అర్హులేనని వక్కాణిస్తూ, అన్ని ఆధ్యాత్మిక గ్రంథాలలోని సారాంశాన్ని అతి సరళమైన రీతిలో "ఇరువది ప్రముఖ ఆధ్యాత్మిక సూత్రములు"గా అందించిరి. మఱియు, ఆధ్యాత్మిక విషయాలను లోతుగా పఠించువారల కొఱకై సుమారు 400 పైచిలుకు ఆధ్యాత్మిక ఆంగ్ల గ్రంథాలను అందించిరి. వాటిలో కొన్ని Sure ways for Success in Life and God Realisation, Mind - Its Mysteries and Control, Sadhana, Bliss Divine, Essence of Yoga మొదలగునవి. ఈ గ్రంథాలన్నీ ప్రముఖ భారతీయభాషలన్నిటిలోనికి అనువదింపబడినవి. ఆధ్యాత్మిక జ్ఞానదానము సమస్త దానముల కంటె మిన్నయని చెబుతూ, ఆయన ఈ ప్రక్రియను ఆధ్యాత్మిక పుస్తకములను, కరపత్రములను ఉచితముగా పంచుటద్వారాను, నిత్య సత్సంగము ద్వారాను కొనసాగించెడివారు. అదే పంథాను నేటికినీ ప్రపంచములోని దివ్యజీవన సంఘశాఖలన్నీ అనుసరించుచున్నవి.

భారతదేశానికి స్వాతంత్ర్యం రాని ఆ రోజుల్లో ఋషీకేశ్ ప్రాంతమైన టెహ్రీగఢ్‌వాల్ పరగణా 'నరేంద్రషా' అనే రాజు అధీనములో ఉండెడిది. ఆయన ఒకసారి తన వృద్ధ మిత్రుణ్ణి చూచుటకు లండన్ వెళ్ళినాడు. 'ఈ వయస్సులోను నీవింత ఆరోగ్యముగా ఉండుటకు

రహస్యమేమైనా ఉన్నదా?' యని రాజు తన మిత్రుణ్ణి పలుకరించగా, ఆయన 'Surya Namaskar' అను ఒక పుస్తకాన్ని చూపి, దీనిలోని సూర్యనమస్కార సాధన విధానము నాకు ఉపకరించుచున్నదని నుడివెను. రాజు ఆ పుస్తకాన్ని చూడగా, ఆ పుస్తక రచయిత స్వామి శివానంద అనే తన పరగణాయందే నివసిస్తున్న ఒక స్వామీజీ అని తెలుసుకొని, వెనుకకు వచ్చిన తత్క్షణమే స్వామీజీని కలిసి, ప్రస్తుతమున్న శివానందాశ్రమ స్థలమును ధారాదత్తము చేసెను. స్వామి శివానంద జ్ఞానప్రసాదమునకున్నట్టి శక్తి అటువంటిది! ఆయన భక్తులలో అనేకులు ఆయన ఆధ్యాత్మిక సాహిత్యముచే ఆకర్షితులైనవారే!

స్వామి శివానందవారు సామాన్యజనులకే కాక, యువకులు, విద్యార్థులు, స్త్రీలు అనెడి అన్ని తరగతుల ప్రజలకు తగిన ఆధ్యాత్మిక సూచనలను గావించిరి. స్వామి చిదానంద, స్వామి కృష్ణానంద వంటి ఎందఱెందరో ప్రపంచ ప్రసిద్ధినొందిన ఆధ్యాత్మికవేత్తలను తయారుచేసిరి. 1950వ సంవత్సరములో భారత, శ్రీలంక దేశాలలో ఆధ్యాత్మిక ప్రచారయాత్రను నిర్వహించి, దివ్యజీవన సందేశమును అందించగా, ఎందఱెందరో ప్రజలు, దేశాధ్యక్షులు, తత్త్వవేత్తలు, ఉన్నత పదవులలో ఉన్నవారు, గవర్నర్లు, అమాత్యులు దివ్యజీవన సంఘము వైపు ఆకర్షింపబడిరి. "మంచిగా ఉండండి, మంచిని చేయండి" అని వారు ఉద్ఘోషించిరి. శివానందాశ్రమములో ఆయన స్థాపించిన 'యోగవేదాంత ఫారెస్ట్ అకాడమీ, ద్వారా 18-60 యేండ్ల వయస్సు కలిగిన జనులెందఱెందరో రెండు నెలల కాలపరిమితిగల ఉచిత శిక్షణను పొంది, ఆధ్యాత్మిక పరిజ్ఞానముతో పాటు క్రమశిక్షణాయుతమైన జీవితాన్ని అభ్యసించి బాధ్యతాయుతమైన ధార్మిక విశ్వపురుషులుగా తీర్చబడిద్దబడుచున్నారు. ఆయన 14.7.1963లో తన తనువును చాలించిరి. శివానందాశ్రమములో శ్రీస్వామివారు తమ సమాధినుండే తమ శక్తిని ప్రసాదించుచుండగా, వారు అవతారము చాలించిన తదుపరి ద్విగుణీకృతముగా సేవాకార్యక్రమములు కొనసాగించబడుచున్నవి.

అన్నమయ్య శరణాగతి

- డా॥ సముద్రాల లక్ష్మణయ్య, తిరుపతి

(గత సంచిక తరువాత)

భక్తి కలికాలంలో భగవదనుగ్రహ ప్రాప్తికి సులభోపాయం. అంతకంటే సులభమైనది "ప్రపత్తి", అంటే శరణాగతి "భరన్యాసం", "భరసమర్పణం" అని కూడా దీనిని వ్యవహరిస్తారు.

"ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే" (6-18) అని శ్వేతాశ్వతరోపనిషత్తు మోక్షాపేక్ష గల వానికి శరణాగతి అనుష్ఠేయమని చెబుతున్నది. భగవద్గీతలో - అన్ని యోగాలూ ప్రతిపాదించిన తరువాత శ్రీకృష్ణ పరమాత్మ చివరి అధ్యాయంలో అర్జునుణ్ణి ఉద్దేశించి -

సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।

అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥ (18-66) అని శరణాగతిని ఉపదేశించాడు.

దీనిని వివరిస్తూ భగవద్రామానుజులు "జ్ఞాన-కర్మ-భక్తి-యోగాల ఫలాన్నీ, పాపాలను తొలగించే ప్రాయశ్చిత్తాలనూ వదలి భగవానుడొక్కడే సేవింపదగినవాడుగా, పొందదగినవాడుగా, పొందుటకు ఉపాయంగా, అనుసంధానం చేయాలి. అలా చేస్తే సకల పాపవిముక్తి భగవంతుడు కలిగిస్తాడు" అని చెప్పాడు.

ఆనుకూల్య సంకల్పం, ప్రాతికూల్య వర్జనం, భగవానుడు రక్షిస్తాడన్న విశ్వాసం, భగవంతుణ్ణి రక్షకుడుగా వరించడం, తన సమస్త భారాన్నీ భగవంతునికే సమర్పించడం, "నేను గతి హీనుడను, నాకు నీవే దిక్కు" అని తన దైన్యాన్ని ప్రకటించడం అని శరణాగతి ఆరు విధాలుగా ఉంటుంది.

అన్నమయ్య సాంగోపాంగమైన శరణాగతిని తన సంకీర్తనలలో విస్తారంగా అభివర్ణించాడు.

ముముక్షువులందరూ తత్త్వం హితం పురుషార్థం - అనే మూడు విషయాలూ తప్పక గ్రహించాలి. వాటినే

"మూడే మాటలు - మూడు మూండ్లు తొమ్మిది
వేడుకొని చదువరో - వేదాంత రహస్యము"

(అన్నమాచార్య సంకీర్తనామృతం -173 వ పుట)

అన్న కీర్తనలో అన్నమయ్య పేర్కొన్నాడు. దీనినే ఇంకా వివరిస్తూ (1) జీవుడు (2) దేవుడు, (3) ప్రకృతి, (4) విజ్ఞానం (5) భక్తి, (6)వైరాగ్యం (7) ఆచార్య విశ్వాసం, (8) శరణాగతి (9) భగవద్దాస్యం - అనే తొమ్మిది మాటల ప్రాముఖ్యం వివరించాడు. ఇందులోని ఎనిమిదవ మాట "శరణాగతి".

"ఆచార్యవాన్ పురుషో వేద" (6-14) అని ఛాందోగ్యం ఆచార్యుని అనుగ్రహం కలవానికే బ్రహ్మ విజ్ఞానం లభిస్తుందని చెప్పింది.

శఠగోపముని, నాథముని, యమునాచార్యులు మున్నగు వారు ప్రపత్తి ప్రాముఖ్యాన్ని లోకానికి బోధించారు. శరణాగతులైనవారు ఇట్టి ఆచార్యులపై దృఢమైన విశ్వాసం కల్గి వుండాలి.

ఒక్కడే మోక్షకర్త - ఒక్కటే శరణాగతి
దిక్కని హరి గొల్చిన - దికిరి తొంటివారు. (160)

అని అన్నమయ్య ఇతరోపాయాల కంటే శరణాగతి ప్రముఖమైన ఉపాయమనీ, మోక్షకర్త శ్రీహరి ఒక్కడే అనీ నిస్సంశయంగా ప్రకటించాడు.

అన్నమయ్య ప్రతిపాదనలోని శరణాగతిలో విష్ణు పారమ్యం కూడా గర్భితమైవున్నది.

ఇందులో మొదలి కర్త - ఎవ్వడు లేడు గాబోలు
ముందు కరివరదుడే - ముఖ్యుడు గాబోలు ॥ (107)

అన్న పాటలో గజేంద్ర రక్షకుడైన శ్రీహరి ఒక్కడే శరణ్యుడని కీర్తించాడు. నక్రగ్రహణ పీడితుడైన గజేంద్రుడు ఎంతగా మొఱపెట్టినా ఇతరదేవతలతణ్ణి కాపాడలేదు. విశ్వమయుడైన వైకుంఠనిలయు డొక్కడే అతణ్ణి రక్షించాడుగదా!

అన్నమయ్య తన రచనలలో విష్ణు పారమ్యాన్ని పలువిధాల ప్రబోధించాడు. ఆయన వాఙ్మయంలో శరణాగతికీ, విష్ణుపారమ్యానికీ, విడదీయరాని సంబంధం కలదని గ్రహించాలి.

శరణాగతుడు "దేవా! అకించనుడను, వేరే గతి లేనివాడను, నాకు ఫలప్రాప్తికి తగిన ఉపాయం అనుష్ఠించే శక్తి లేదు. నాపై దయయుంచి నీవే ఆ ఉపాయానికి మారుగా ఉండి ఆ ఫలం నాకు ప్రసాదించు" అని అంటాడు.

అన్నమయ్య దైన్యాన్నీ, నైచ్యానుసంధాన ప్రక్రియనూ ఆశ్రయించి పెక్కు పదాలు పాడాడు.

"నేనొక్కడ లేకుండితే - నీకృపకు పాత్రమేది?
పూని నావల్లనే కీర్తి - పొందేవు నీవు". (258)

అన్న పాటలో ఎంతో చమత్కారంగా ఈ ప్రక్రియను పాటించాడు.

శరణాగతుడు తనకై తాను చేసుకోవలసిందేదీ వుండదు. అతడు అస్వతంత్రుడు. సంపూర్ణంగా భగవదధీనుడు. పిల్లి పిల్ల తన బాధ్యతను పూర్తిగా తల్లికే వదలివేస్తుంది. అట్లే శరణుపొందినవాడు తన బరువు బాధ్యతలను భగవానునికే విడిచిపెడతాడు -

"నరహరి! నీదయమీదట - నాచేతలు కొన్నా?
శరణాగతియును జీవుని - స్వతంత్రముగాదెందా? (312)

అన్న కీర్తనలో ఈ విషయాన్నే అన్నమయ్య నొక్కి వక్కాణించాడు.

"ధరనింద్రియాలెంత - తరుముకాడిన నన్ను
సరిగావ గద్దుగా - శరణాగతి "

అన్న కీర్తనలో ఇంద్రియాలు ఎంతగా వ్యక్తిని బాధించినా, అతడు శరణాగతుడైతే రక్షణ తప్పక చేకూరుతుంది అని తెలిపాడు.

'నీవే కావగ కర్తవు, నేనే శరణాగతుడను' (239)

అనుచోట రక్షకుడు శ్రీహరి అనీ, రక్షితుడు భక్తుడనీ, భక్తుడు శరణు కోరితే తప్పక రక్షణ చేకూరుతుందనీ వివరించాడు.

'శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే'

అను మంత్రం గూడా శరణాగతినే బోధిస్తున్నది.

నిన్ను నమ్మి విశ్వాసము నీపై నిలుపుకొని
ఉన్నవాడ నిక వేరే - ఉపాయమేమిటికి? (166)

అన్న సంకీర్తనలో దేవునిపై శరణాగతునికి విశ్వాసం గట్టిగా వుండాలని చెప్పదమైనది. ఇలా ప్రపత్తి ప్రాముఖ్యాన్ని అన్నమయ్య తన సంకీర్తనలలో పలుచోట్ల వివరించియున్నాడు.

(ఇంకను ఈ శరణాగతి'లో విశేషాలను శ్రీమలయాళ స్వామివారి గీతావ్యాఖ్యలోనూ, శ్రీవిద్యాప్రకాశానందస్వామి వారి గీతామకరందంలోనూ పఠించి గ్రహించగలరు)

గృహవైద్యం

వెల్లుల్లి రెబ్బలు పూటకు రెండు లేదా మూడు అవునెయ్యిలో వేయించి తింటూంటే ఎముకల నొప్పులు త్వరగా తగ్గిపోతాయి.

వింత గొలుసు

– శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వాములవారు

ప్రపంచంలో ఎన్నో త్రాళ్ళు వున్నాయ్, గొలుసులున్నాయ్. మనిషిని ఏ త్రాటితో కట్టినా, ఏ గొలుసుతో బంధించినా కదలలేక, మెదలలేక పడియుంటాడు. కాని ఒక విచిత్రమైన గొలుసు వుంది. దానితో గనక మనిషిని కట్టివేస్తే ఇక దశ దిశలు పరుగెత్తుతూంటాడు. ఒక చోట స్థిరంగా వుండడు. ఇది విద్దూరం కదా! ఆ గొలుసేమిటో తెలుసుకోవాలని అందరికీ సహజంగానే కుతూహలం వుంటుంది. ఆశయే ఆ గొలుసు.

ఆశ అను శృంఖలం (గొలుసు)చే పరివేష్టితుడైనవాడు ప్రపంచంలోని అన్ని విషయాలను, అన్ని భోగాలను అనుభవించాలని ఉబలాడపడుతూంటాడు. వాడి మనస్సు స్తిమితంగా వుండదు. పోనీ ఒకదాన్ని అనుభవించినా అంతటితో ఊరుకోడు, మరొకదాని కొరకు పరుగెత్తుతాడు. ఆ గొలుసు వీడిపోయెనా ఇక ఎక్కడికి పోడు. ఒకచోట నిబ్బరంగా వుంటాడు. కనుకనే ఆశను ఒక ఆశ్చర్యకరమైన గొలుసుగా పెద్దలు వర్ణించారు. దాన్ని ఒక వింత గొలుసుగనే చెప్పవచ్చు.

కాబట్టి జీవుడా! ఆ గొలుసును ఊడదీసుకో. లక్షణంగా ఆత్మ యందు కదలక మెదలక పడియుండు. నీకు ఎంత ఆనందం కలుగుతుందో అపుడు నీవే గ్రహిస్తావు. ఈ ప్రపంచంలో ఇటూ అటూ పరిగెత్తి క్షణికమైన ఇంద్రియ విషయాలను ఇంత కాలం అనుభవించి నీవేమి మూటగట్టుకున్నావు? దుఃఖాన్ని పోగొట్టుకున్నావా? త్రెంపులేని ఆనందం అనుభవించావా? ఇప్పటికి ఎన్ని జన్మలో పాడు చేశావ్. మహోన్నతమైన ఈ జన్మను వృథా చేసుకోవద్దు. ఆశయను సంకెలను త్రెంచి పారవేయ్. బ్రహ్మానందము అనుభవించు. ఆత్మ సన్నిధికి, దైవసన్నిధికి చేరు. నిశ్చలముగా వుండు. మానవత్వాన్ని సార్థకం చేసుకో. మాధవత్వాన్ని పొందు.

ఆశానామ మనుష్యస్య కాచిదాశ్చర్య శృంఖలా
యయా బద్ధాః ప్రధావన్తి ముక్తాస్తిష్ఠన్తి పంగువత్ ॥

ముణ్డకోపనిషత్తు

ఈ ఉపనిషత్తు అథర్వణవేదంలోని శౌనకీయ శాఖకు చెందినది. ముణ్డకమనగా గుండు చేసిన (పూర్తిగా వెంట్రుకలను గొరిగివేసిన) శిరస్సు అని అర్థము. దీనినే ఉపనిషత్తు యొక్క చివరి మంత్రంలో "క్రియావంతః శిరోవ్రతం విధివత్ యైస్తు చీర్ణమ్" ॥ అని ముణ్డకం శిరోవ్రతమని చెప్పడం జరిగింది. తలపైనున్న నల్లని జుట్టును మంగలికత్తి ఏమీ మిగలకుండా గొరిగివేసిన విధంగా ఈ ఉపనిషత్తులో చెప్పబడిన పరావిద్య జీవుని ఆవరించిన అజ్ఞానాన్ని పూర్తిగా తొలగిస్తుంది అని అర్థము.

త్రిమతాచార్యులు తమ తమ భాష్యాలను వ్రాసిన దశోపనిషత్తులలో ఈ ముణ్డకోపనిషత్తు ఒకటి. ఈ ఉపనిషత్తును ఆంగిరస మహర్షి తన శిష్యుడైన శౌనకునకు ఉపదేశించాడు. కాబట్టి దీనిని శౌనకశాఖకు చెందినదిగా అభిప్రాయపడుచున్నారు. ఇది మూడు భాగాలు కలిగి ఉంది. వీనినే మూడు ముణ్డకాలన్నారు. ఈ మూడు ముణ్డకాలు ఒక్కొక్కటి రెండు ఖండాలు గల్గియుంది. అనగా ఈ ఉపనిషత్తులో ఆరు ఖండాలు, 64 మంత్రాలున్నాయి.

ప్రప్రథమంగా ఈ ఉపనిషత్తును హిరణ్యగర్భుడు తన జ్యేష్ఠకుమారుడగు అథర్వునకు ఉపదేశించాడు. ఆ అథర్వుడు అంగిరునకు, ఆ అంగిరుడు సత్యవహునకు, సత్యవహుడు ఆంగిరసునకు ఉపదేశించాడు. ఆ ఆంగిరసుడు శౌనకునకు ఉపదేశించాడు. అట్లీ ఉపనిషత్ప్రతిపాదిత పరావిద్య పరంపరగా వచ్చినది.

శౌనకుడు మహాగృహస్థుడు. అతడు సమిత్పాణియై ఆంగిరసుని సమీపించి సమిధలు సమర్పించి సాష్టాంగప్రణామం చేసి అతివినయంతో ఓ భగవంతుడా! (పూజ్యుడా!) "దేనిని తెలిసికొనినచో ఈ సమస్తమూ తెలియబడినదవుతుంది" అని ప్రశ్నించాడు. శాస్త్రోక్త

శిష్యలక్షణములు గల్గి వినయవిధేయతలు గల శౌనకుని పరిప్రశ్న విధానాన్ని చూచి సంతుష్టుడైన అంగిరసుడు ప్రసన్నుడై ఇలా చెప్పాడు-

పరా, అపరా అని రెండు విద్యలున్నాయి. అందు వేద వేదాఙ్గాలను బోధించేది అపరావిద్య. సమస్తానికి ఆధారమైన, సమస్తంలో వ్యాపకంగా వున్న నిర్గుణ బ్రహ్మను బోధించేది పరావిద్య అని బ్రహ్మవేత్తలు చెప్తున్నారు అంటూ శౌనకునకు అంగిరసుడు ఈ ముణ్డకోపనిషత్తును బోధించాడు.

ఈ ఉపనిషద్విషయాన్ని సరళంగా తెలియజేయాలనే మా ప్రయత్నమే ఇది. ఉపనిషత్ప్రారంభంలో, చివరగూడ శాన్తి మన్త్రాలను చదువడం శిష్టాచారము. దాన్ననుసరించి ఈ ఉపనిషత్తును చదివే ముందు, చదివిన తరువాత చివరలో "భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః" అను శాన్తిమన్త్రాన్ని చదవాలి.

"ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః । భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః । స్థిరైరఙ్గై స్తుష్టువాగ్ంసస్తనూభిః । వ్యశేమ దేవహితం యదాయుః । స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః । స్వస్తి నః పూషా విశ్వవేదాః । స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః । స్వస్తినో బృహస్పతి ర్దధాతు॥

తా॥ ఓ దేవతలారా! గురుశిష్యులమైన మేము చెవులతో శుభప్రదమైన - మంగళప్రదమైన వానిని విందుముగాక! పాలకులారా! కళ్ళతో (కన్నులతో) శుభప్రదమైన దృశ్యాలను చూతుముగాక! దృఢమైన అవయవాలతో గూడిన మా శరీరాలతో మీ స్తోత్రాలను చేస్తూ దైవనియమితమైన దేవహిత కార్యాలకోసరం మా సంపూర్ణ ఆయుస్సును గడుపుదుము గాక! గొప్ప కీర్తిమంతుడయిన (యశస్వియగు) ఇన్ద్రుడు మాకు శుభముల నొసగుగాక! అభ్యుదయాన్నిచ్చు గాక! పరమ జ్ఞానియగు (సకలమును పోషించు) సూర్యుడు మాకు కళ్యాణముల నొసగుగాక! సమస్త ఆపదలను (కీడును) చెల్లాచెదరు చేయజాలిన (నాశనం చేయగల) అనూరుడు, చక్రంతో సమాన గరుత్మంతుడు

మాకు శుభముల నొసంగుగాక! దేవతల గురువు బృహస్పతి మాకు శుభముల నొసంగు గాక!

ఓం ఆధ్యాత్మిక తాపము శాన్తించుగాక! ఆధిదైవిక తాపము శాన్తించుగాక! అధి భౌతిక తాపము శాన్తించుగాక !

ప్రథమ ముణ్డకము - ప్రథమ ఖణ్డము

1. విశ్వసృష్టికర్త, జగద్రక్షకుడగు బ్రహ్మ దేవతలలో మొదట జన్మించాడు, అతడు మొదటివాడయ్యాడు. అతడు తన జ్యేష్ఠ కుమారుడైన అథర్వునకు అన్ని విద్యలకు ఆశ్రయమైన (ఆధారమైన) బ్రహ్మవిద్యను చెప్పాడు - ఉపదేశించాడు.

2. బ్రహ్మ అథర్వునకు ఏ బ్రహ్మవిద్యను ఉపదేశించాడో ఆ బ్రహ్మ విద్యను పూర్వం అథర్వుడు అంగిరునకు చెప్పాడు. దానిని ఆ అంగిరుడు భరద్వాజగోత్రుడైన సత్యవహునకు బోధించాడు. దానిని సత్యవహుడు అఙ్గిరసునకు చెప్పాడు. ఇట్లే బ్రహ్మవిద్య (ఈ ఉపనిషత్తు) క్రమంగా శిష్య పరంపరగా ప్రాప్తమైనది.

3. ఉత్తమగృహస్థుడగు శౌనకుడు శాస్త్రంలో చెప్పిన ప్రకారం సమిత్పాణియై అఙ్గిరసుని సమీపించి సాష్టాంగ ప్రణామాలు చేసి అతి వినయంతో - "పూజ్య మహర్షీ! దేనిని తెలిసికొనడం వలన ఇదంతా (దృశ్యమానమంతా) తెలిసినదవుతుంది" - అని అడిగాడు.

4. వినయ విధేయతలు, పూర్ణ జిజ్ఞాస గలిగియున్న శౌనకునితో అఙ్గిరసుడిలా చెప్పాడు - తెలుసుకోదగిన విద్యలు రెండున్నవి. అవి అపరావిద్య, పరావిద్య అని బ్రహ్మవేత్తలు చెప్పుచున్నారు.

5. వానిలో ఋగ్వేదము, యుజర్వేదము, సామవేదము, అథర్వణవేదములను నాల్గు వేదాలు, శిక్ష కల్పము, వ్యాకరణము, నిరుక్తం, ఛన్దస్సు, జ్యోతిషం అనునవన్నీ అపరావిద్య. ఏ విద్య చేత ప్రసిద్ధమైన నాశరహిత అక్షరతత్త్వం తెలియబడుతూందో ఆ విద్య పరావిద్య. (సశేశం)

ప్రేయస్సు – శ్రేయస్సు, ప్రవృత్తి – నివృత్తి

డా॥ ఎ. తారాలక్ష్మి
యం.ఎ, యం.ఇడి., పి.హెచ్.డి.

చతుర్విధ పురుషార్థములలో ధర్మపురుషార్థము మొదటిది. 'ప్రాణినాం సాక్షాదభ్యుదయ నిశ్రేయసహేతుర్యః సధర్మః' అనునది శృతి వాక్యము. ధర్మాచరణము వలన ఇహలోకములో అభ్యుదయము మరియు పరలోకములో మోక్షము కల్గుతాయని అర్థము. 'సత్యం వద ధర్మం చర' అన్న ఆప్త వాక్యాన్ని అనుసరించి సత్యాన్ని పలకాలి మరియు ధర్మాన్ని ఆచరించాలి. 'వేద విహిత కర్మ ధర్మః' అని జైమిని మహర్షి తన కర్మ సిద్ధాంతములో వివరించి యున్నారు. మనుస్మృతి ప్రకారము-

ధర్మ యేవ హతో హన్తి - ధర్మో రక్షతి రక్షితః
తస్మాద్ధర్మో నహంతవ్యః - యానో ధర్మో హతోవధీత్ ॥

ధర్మాన్ని నాశనం చేయ ప్రయత్నించువారిని ధర్మమే నాశనము చేస్తుంది. అలాగే ధర్మ రక్షకులను ధర్మమే రక్షిస్తుంది అని అర్థం. ఆదిశంకరులవారు భగవద్గీతా భాష్యములో ధర్మమును రెండు రకములుగా అభివర్ణించారు. అది ఒకటి ప్రవృత్తి ధర్మము, రెండవది నివృత్తి ధర్మము.

కఠోపనిషత్తులో యమధర్మరాజు నచికేతునితో, ఈ మనుష్యలోకమున ఏఏ విషయ భోగములు మానవులకు దుర్లభములై యున్నవో, వాని నన్నింటిని నీకిచ్చెదను కోరుకొనుము, వాటితో సుఖముగ నుండుము అని పలుకగా, అందుకు నచికేతుడు "మీరు చెప్పినవి నశ్వరములు. అవి మానవుల తేజస్సును నశింపజేయును. వానికి భిన్నమయిన ఉత్కృష్టమైన మార్గమేదైతే కలదో దానిని బోధించమని" వేడుకొనెను. అందుకు యమధర్మరాజు - ఓ నచికేతుడా! లోకములో ఒకటి శ్రేయస్సును మరియొకటి దానికంటె విలక్షణమైన

ప్రేయస్సు నొసగునది అగు రెండు మార్గములు కలవు. ఈ రెండు భిన్న మార్గములు మనుజుని వద్దకు వచ్చి చేరుతున్నవి. ఇందు శ్రేయస్సును అనుసరించు వానికి శుభము కల్గును. ప్రేయస్సును వాంఛించువాడు గమ్యస్థానమును పొందజాలడు. వివేకవంతుడు ఈ రెంటినీ చక్కగా పరీక్షించి శ్రేయోమార్గమును అనుసరించును. మంద బుద్ధులు రాగ తృష్ణలకు లోనై ప్రేయస్సునే కోరుకొని బంధనములో చిక్కుకొందురు" అని ప్రబోధించారు.

కావున, జీవన యానంలో మానవుడు గమ్యం చేరడానికి ఆతని ముందు రెండు మార్గాలున్నాయి. అదియే శ్రేయో మార్గం మరియు ప్రేయో మార్గం. భౌతిక స్థాయిలో సుఖంగా జీవించుట కొరకై, ప్రాపంచిక భోగాలను అనుభవించుట కొరకై మనుజుడు చేయు ప్రయత్నమే ప్రేయో మార్గం. పరమ పురుషార్థమైన మోక్షము కొరకు చేయు ప్రయత్నమే శ్రేయో మార్గం. ప్రేయో మార్గం ప్రియం కలుగజేస్తుంది. ఈ మార్గంలో కర్మానుష్ఠానం వలన ఇహలోకంలో కొంత అభ్యుదయం కలిగించినా అది అశాశ్వతం మరియు దుఃఖ హేతుకం. ఇందుకు భిన్నంగా శ్రేయో మార్గం జ్ఞాన సముపార్జన ద్వారా శ్రేయస్సువైపు నడిపించి ఆతనికి పరిపూర్ణతను మరియు శాశ్వతానందమును ప్రసాదిస్తుంది. లోకంలో వివేకవంతుడు శ్రేయోమార్గాన్ని, అవిద్యా వశుడు ప్రేయో మార్గాన్ని ఎన్నుకుంటాడు.

ప్రేయో మార్గము అవిద్యా రూపము. దానిని అనుసరించువారు తామే ప్రజ్ఞావంతులమని ఆత్మ స్తుతికి పాల్పడుతూ ఉంటారు. భౌతిక సంపదలను ప్రోగుచేసుకోవడం, ఐహిక భోగాల వెంట పరుగులెత్తడం, అధికారాన్ని చేజిక్కించుకోవడం, పదవులను చేపట్టడం మొదలైనవన్నీ ప్రేయో మార్గం కోవకు చెందుతాయి.

ప్రేయో మార్గంలో మనుజునకు సహజంగానే వస్తువులు, మనుష్యులు, విషయాలు మరియు ప్రదేశాల పట్ల బంధం ఏర్పడుతుంది.

ఫలితంగా రాగ ద్వేషాలు ఏర్పడుతాయి. అదియునూ గాక ప్రేయో మార్గంలో మానవునకు ఎంత సాధించినా తృప్తి కలుగదు. ఇంకా, ఇంకా సాధించాలనే తృష్ణ కొనసాగుతుంది. ఇందు పారమార్థిక ఆనందం కొరవడుతుంది. ఒక సుఖం అనుభవించులోపే దుఃఖం వెన్నంటి ఉంటుంది. ప్రేయోమార్గం మనుజుని సంసారంలో బంధిస్తుంది. మొదటి మూడు పురుషార్థాలు ప్రేయో మార్గం కోవకు చెందుతాయి.

ధర్మము ప్రవృత్తి మరియు నివృత్తి ధర్మములుగా వర్గీకరించినట్లు ముందు తెలిసికొన్నాము. ప్రేయో మార్గాన్నే ప్రవృత్తి ధర్మంగా ముందు తెలిసికొన్నాము. ప్రేయో మార్గాన్నే ప్రవృత్తి ధర్మంగా అభివర్ణించ వచ్చును. ప్రవృత్తి ధర్మం తిరిగి రెండు విధాలు. సకామ ప్రవృత్తి ధర్మం మరియు నిష్కామ ప్రవృత్తి ధర్మం. మనుజుని మనస్సులో చెలరేగిన కోరికలు, అవి మంచివైనా, చెడ్డవైనా, నైతికమైన వైనా లేక అనైతికమైన వైనా సరే, వాటిని నెరవేర్చుకొనుటకు చేసే కర్మలన్నింటిని సకామ ప్రవృత్తి కర్మలుగా పరిగణిస్తారు. ఆదిలో ఈ సకామ క్రియలు కేవలం నిత్యావసరాల వరకే పరిమితం అయి ఉంటాయి. రానురాను అవి భోగలాలసత, అధికారం, పేరు ప్రతిష్ఠల వంటి వాటికి దారితీస్తాయి. ఇహలోక సౌఖ్యాలే కాక స్వర్గం వంటి పరలోక సుఖాల వైపు కూడా మక్కువ ఎక్కువ అవుతుంది. సకామ ప్రవృత్తి కర్మలు ప్రధానంగా వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలకే పరిమితమై ఉంటాయి. పరహితం, దైవహితం ఇందు లేశమైనా కానరాదు.

నిష్కామ ప్రవృత్తి ధర్మంలో మనుజుడు స్వార్థ ప్రయోజనాలను ఆశించి కర్మలు చేయడు. పరహితం, దైవహితం మరియు సమాజశ్రేయస్సును ఆశించి చేసే ప్రవృత్తి కర్మలన్నీ నిష్కామ ప్రవృత్తి కర్మల కోవకు చెందుతాయి. ఈ మార్గంలో ఉన్న మనుజునకు చిత్త నైర్మల్యం సిద్ధిస్తుంది. ఆతను చేసే ప్రతి నిష్కామ కర్మ కర్మ యోగమవుతుంది.

నివృత్తి ధర్మం సాధకుని ఆత్మజ్ఞాన సముపార్జన వైపు నడిపిస్తుంది మరియు వైరాగ్య పథము వైపు నడిపిస్తుంది. శ్రవణ, మనన నిధి ధ్యాసనలతో ఆతడు సత్యాన్ని తెలుసుకుంటాడు. నివృత్తి ధర్మం కూడా రెండు దశలలో ఉంటుంది. మొదటిది సాధనా రూప నివృత్తి ధర్మం. రెండవది సాధ్యరూపక నివృత్తి ధర్మం. సాధనారూపక నివృత్తి ధర్మంలో సాధకుడు సాధన చతుష్టయ సంపన్నుడౌతాడు. ఆతని చిత్తం శుద్ధమవుతుంది. శుద్ధమైన మనస్సు ఆత్మ జ్ఞానాన్ని పొందుటకు సంసిద్ధమవుతుంది. ఈ దశలో సాధకుడు శ్రవణ మనన నిధిధ్యాసనలను చక్కగా శీలిస్తాడు. శరీరం పతనం కాకముందే ఆత్మను తెలిసికొని సంసార బంధమునుండి విముక్తుడవుతాడు. ఈ దశలో సాధకుడు బ్రహ్మ సాక్షాత్కారాన్ని పొంది బ్రహ్మ నిష్ఠుడే అవుతాడు. జనన మరణ రూప సంసార సాగర తీరాన్ని అవలీలగా దాటగలడు. కనుక వివేకంతో మనుజుడు అప్రమత్తుడై, ధీరుడై పై రెండు మార్గములను చక్కగ పరీక్షించి ప్రాపంచిక వస్తు జాలములో చిక్కుకొనక శ్రేయో మార్గము వైపు జీవితమును నడిపించవలెను.

మీకు తెలుసా?

1. మనిషిగుండె ఒక సంవత్సరానికి మూడు కోట్ల డెబ్బయి లక్షల సార్లు కొట్టుకొంటుంది.
2. **పంచలవణాలు** - సైంధవలణము, సౌవర్చలవణము, బిడాలవణము, సముద్రలవణము, కాచలవణము.
3. **పంచామృతం** - నీరు, పాలు, పెరుగు, నెయ్యి, తేనె (వీని కలయిక పంచామృతము).
4. **అష్టగంధాలు** - కర్పూరం, కస్తూరి, పునుగు, జవ్వాజి, అగరు, పన్నీరు, అత్తరు, శ్రీగంధము.
5. **నవరత్నాలు** - వజ్రము, వైదూర్యము, గోమేధికం, పుష్యరాగము, మరకతం, మాణిక్యం, నీలము, ముత్యము.

శ్రీ మదాంధ్ర భాగవతం - తృతీయ స్కంధం

వచనానువాదం - **ఆచార్య జక్కంపూడి మునిరత్నం**

(జూన్ సంచిక తరువాయి)

మహత్తు మొదలైన తత్త్వాలూ, పంచభూతాలూ, పంచేంద్రియాలూ, పంచతన్మాత్రలూ వేరువేరుగా ఉండి అన్నీ సమైక్యం కాకపోవడంతో ప్రపంచాన్ని సృష్టించడానికి సామర్థ్యం వాటికి సరిపోలేదు. అందువల్ల అందరూ శ్రీమన్నారాయణుణ్ణి స్తోత్రం చేశారు. దయతో నీ శక్తిని ప్రసాదించి లోకాలను సృష్టించే శక్తిని మాకు కలిగించు అని వేడుకున్నారు. విష్ణువు సంతోషించాడు. ప్రసన్నుడయ్యాడు. పంచభూతాలు, పంచతన్మాత్రలు, పది ఇంద్రియాలు, కాలము, ప్రకృతి, మహత్తు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనబడే ఇరవై ఏడు తత్త్వాల్లోనూ తానే ప్రవేశించాడు. వేరువేరుగా ఉన్న వాటికి ఐక్యతను కలిగించాడు. దానితో సృష్టిప్రక్రియ ప్రారంభానికి దోహదమేర్పడింది. మొదట ఏర్పడిన జలంలో విరాట్పురుషుడు బ్రహ్మాండమనే గర్భరూపంలో వేయి సంవత్సరాలు ఉన్నాడు. ఆ గర్భంనుంచే సమస్త సృష్టి వెలువడింది. దైవ కర్మాత్మల శక్తి వ్యాపించి భగవంతుడే అనేక రూపాలతో వెలుగొందాడు. విరాట్ స్వరూపం అధ్యాత్మికం, అధిభూతం, అధిదైవం అనబడే మూడు భేదాలతో విరాజిల్లుతూ ఉంది. జీవులకు ఆత్మగా కూడా ఇది ప్రకాశిస్తూ ఉంది. ఈ విరాట్పురుషుణ్ణుంచే సమస్త ప్రపంచమూ సంభవించింది. విరాట్స్వరూపుడి అవయవాలనిప్పుడు నీకు వినిపిస్తాను ఏకాగ్రంగా విను.

విరాట్పురుషుడి ముఖాన్ని అగ్ని తనకు స్థానంగా చేసుకున్నాడు. కాబట్టి జీవుడు శబ్దాన్ని పలికేందుకు వీలైంది. కళ్ళకు అధికారి సూర్యుడు. అతడు రూప విజ్ఞానాన్ని కలుగ జేస్తాడు. వాయువుకు చర్మం స్థానం. జీవుడికి స్పర్శజ్ఞానం కలిగించాడు. చెవులలో దిక్కులు శబ్దజ్ఞానం కలిగించాయి. తాలువుల్లో వరుణుడు ప్రవేశించి జీవుడి

రసనేంద్రియం (నాలుక)గా ప్రకాశిస్తున్నాడు. అందువల్ల రుచులు తెలుస్తూ ఉన్నాయి. ముక్కు అశ్వినీదేవతల స్థానం. దానివల్ల జీవుడికి వాసన చూసే వీలుకలిగింది. పరమపురుషుడినుండి వేరైన చర్మం ఓషధులు ఆయన అంశలైన కేశాలను కూడడంచేత జీవుడికి కండూయమాన స్థితి ఏర్పడింది. అట్లే పరమేశ్వరుని నుండి వేరైన పురుషాంగంలో ఈశ్వరాంశమైన ప్రజాపతి రేతస్సుతో సంయోగమందటం వల్ల జీవుడు ఆనందాన్ని పొందుతున్నాడు. పరమేశ్వరుడి నుండి వేరైన గుదస్థానంలో అచ్యుతాంశమైన మిత్రుడు వాయువుతో కూడి ప్రవేశించడం వల్ల జీవుడికి మలవిసర్జనశక్తి కలుగుతూ ఉంది. విరాట్పురుషుడి నుండి విడివడిన చేతుల్లో ఈశ్వరాంశతో ఇంద్రుడు ప్రవేశించాడు. దానితో జీవనోపాధికి ఉపకరించే ఇచ్చిపుచ్చుకునే శక్తి కలిగింది. విరాట్ పురుషుడి నుండి వేరైన పాదాలను విష్ణువు అధిష్ఠించి గమనశక్తిని కలిగించాడు. పరమేశ్వరుని నుండి బయటకు వచ్చిన హృదయం మనస్సుతో కలిసింది. చంద్రుడు వాటిని అధిష్ఠించాడు. అప్పుడు జీవుడికి సంకల్ప వికల్పాలు కలిగాయి. విరాట్పురుషుడి నుంచి అహంకారం వేరుపడింది. దానిలో రుద్రుడు ప్రవేశించాడు. అప్పుడు జీవుడు కర్తవ్యోన్ముఖుడయ్యాడు. తరువాత బుద్ధి విడివడింది. అది వాగీశ్వరుడికి నివాసమయింది. ఆ బుద్ధే జ్ఞానంతో కలిసి ప్రకాశించింది. దానితో జీవుడికి గ్రహణశక్తి కలిగింది. చిత్తం కూడా విడివడి బ్రహ్మకు నివాసమైంది. అది ఆవిధంగా చైతన్యం పొందగానే జీవుడు విజ్ఞానాన్ని పొందాడు.

విరాట్పురుషుడి తలనుండి స్వర్గము, నాభినుండి ఆకాశమూ, పాదాలనుండి భూమి ఏర్పడ్డాయి. సత్త్వ రజస్తమో గుణాల వల్ల దేవతలు, మానవులు, గోవులు, భూతగణమూ పుట్టాయి. సత్త్వగుణం అధికం కావడం వల్ల దేవతలు స్వర్గాన్ని పొందారు. రజోగుణంవల్ల మనుష్యులూ, గోవులూ మొదలైన జీవులు భూమిని పొందాయి. తామసగుణం వల్ల భూతాదులైన రుద్రపారిషదులు భూమికీ ఆకాశానికీ

మధ్యగల ప్రదేశాన్ని పొందారు. విరాట్పురుషుడి ముఖం నుండి వేదాలు పుట్టాయి. ఆ ఈశ్వరుడి ముఖం నుండి బ్రాహ్మణులు పుట్టారు. భుజాలనుండి రాజులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు ప్రాదుర్భవించారు. విదురా! వెయ్యి చెప్పడమెందుకు? శ్రీమన్నారాయణుడి మహిమను ఆయన నాభికమలం నుంచి పుట్టిన బ్రహ్మ కూడా తెలుసుకోలేకపోయాడంటే అలాంటిది ఇతరులకు ఎలా సాధ్యమౌతుంది ? మహేంద్రుడూ, మహదాది తత్త్వాలూ, దిక్పాలకులూ, పద్మసంభవుడూ, పరమశివుడూ కూడా చూడలేని ఆ దేవదేవుడి పాదపద్మాలను నా మనస్సులో ధ్యానిస్తాను". రాజా! మైత్రేయుడు విదురుడికి హరిమహిమలనేకం తెలియజేశాడు. విదురుడికి ఇంకా తెలుసుకోవాలనే కుతూహలం ఎక్కువైంది. అనేక ప్రశ్నలు వేశాడు.

"నిర్గుణుడైన భగవంతుడు లోకాలను పుట్టించడం, పోషించడం, విలీనం చెయ్యడం ఎలా పొసగుతుంది? నిర్గుణుడైన భగవంతుడు సగుణుడుగా కూడా ఎలా ఉండగలుగుతాడు? ఇది పరస్పర విరుద్ధమనిపించడం లేదా? కోరికలు లేని భగవంతుడికి క్రీడల మీద ఆసక్తి కలగడం, ఆయన అనేక లీలలు ప్రదర్శించడం విడ్డూరంగా లేదా? మాయకు సత్త్వము, రజస్సు, తమస్సు అని మూడు గుణాలు. అటువంటి మాయను ఆయన ఎందుకు సృష్టించాడు? దానిద్వారా లోకాలను సృజించాలనే కుతూహలం ఈశ్వరుడికి ఎందుకు కలిగింది? జ్ఞానస్వరూపుడైన భగవంతుడు ఏవిధంగా ప్రకృతితో కలిసి ఉంటాడు? సర్వేశ్వరుడు సర్వుల శరీరాల్లోనూ జీవుడి రూపంలో ఉంటాడు కదా! అలాంటి జీవుడికి గర్భ నరకాది కష్టాలు ఎలా కలుగుతున్నాయ్? మహాత్మా! ఇలాంటి ప్రశ్నలు నన్ను పొద్దస్తమానమూ వేపుకతింటున్నాయ్. ఈ అజ్ఞానం నుంచి బయటపడలేక పోతున్నాను. ఈ సంశయాలన్నిటినీ సమూలంగా తొలగించే సామర్థ్యం మహావిద్వాంసుడివైన నీకే ఉంది". అని విదురుడు మైత్రేయుణ్ణి అడిగిన ప్రశ్నలకు మైత్రేయుడు ప్రత్యుత్తరాలివవ్వడం ప్రారంభించాడు. (సశేషం)

అమృతానుభవము

మూలం:
సంత్ జ్ఞానేశ్వర్

తెనుగు :
నైనారు అప్పాస్వామి

చెరకులోనుండు తీపి సుస్థిరముగాను
తంత్రి లోపల శబ్దంబు తనరియుండు
పూయుటకుముందె పుప్పొడి పుష్పమందు
భాగమైయుండు నామీద ఫలముగలుగు.

సూర్యుడుండగ వెన్నెలల చూడలేము.
చంద్రుడెరుగును తనలోని చంద్రక్రాంతి
అందమెట్లుండు నాననం బసలు లేక?
కాయమేలేక వయసెట్లు కనగనగును?

మనసు లేకున్న నెటుల కామనలు గలుగు?
కార్యమేలేక శ్రేష్ఠత కలుగునెటుల?
కట్టెలను కాల్చకయె మంట కలుగునెట్లు?
భావమందున మాత్రమే పరగునగ్ని

పంట వేయక ధాన్యంబు పండినట్లు
వంట చేసితి నేనని పల్కినట్లు
వట్టి మాటలచే నాత్మ వశము గాదు
మాటల కతీతమై యది మనుచునుండు.

ఈ రహస్యంబు నెరుగగ నెవ్వరేని
దాటి పోవలె నిశ్శబ్ద తలముగూడ
పై యుదాహరణములెల్ల పైకి తేల్చు
దాని నెరుగగ మాటలు తగవటంచు

వార్తలు

(01). 2-8-2021 తేది సోమవారం ఆడికృత్తిక సందర్భంగా ఆశ్రమ శివాలయంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజ చేయబడినది. అందరికి ప్రసాద వితరణ జరిగినది.

4-8-2021 తేది బుధవారము యోగినీ ఏకాదశినాడు ఆశ్రమము శివాలయంలో 18 అధ్యాయాలు, గీతాపారయణ జరిగినది.

(02). 6-8-2021 తేది శుక్రవారం మాసశివరాత్రి రోజు ఆశ్రమ శివాలయంలో ప్రదోషకాలంలో నర్మదేశ్వరునకు రుద్రాభిషేకం, బిల్వార్చన జరిగినది.

(03). 12-08-2021వ తేదీ ఉదయం పదిగంటలకు సద్గురు సర్వసేవాట్రస్టు బోర్డు సమావేశం శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారి ఆధ్యక్షతన జరిగినది.

(04). 15-8-2021 తేది ఆదివారం స్వాతంత్ర దినోత్సవం జరిగినది. మఱియు శ్రీఅరవిందయోగి జయన్తి యున్ను జరిగినది.

(05). 29-8-2021 తేది ఆదివారం కృత్తికసందర్భంగా ప్రదోషకాలంలో శివాలయంలోని కుమారస్వామికి పంచామృతాభిషేకం, విభూతి అభిషేకం, అర్చన చేయబడి ప్రసాదవినియోగం జరుగును.

(06). ఆశ్రమంలో అర్ధచాతుర్మాస్యం ప్రారంభింపబడి జరుగుచున్నది. ప్రతిరోజు ఉదయం 10 గం॥ల నుండి పూజ్యశ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు వివేక చూడామణి చెప్తున్నారు. సాయంత్రం 4 గం॥ల నుండి పూజ్యశ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు భాగవతం చెప్తున్నారు.

(07). 30-8-2021 తేది సోమవారం ఆశ్రమంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణమూర్తికి షోడశోపచార పూజ జరిగి ప్రసాదవినియోగం చేయబడును.

(08). ఆశ్రమ కంటిఆసుపత్రిలో జూలై నెలలో ఓ.పి. విభాగంలో **654** మందికి కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేయబడినవి. **65** మందికి కంటి పొరలు తీసి కళ్ళలో లెన్సు అమర్చబడినవి.

పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారి
రచనలు చదవండి, చదివించండి.

		రూ.
1.	గీతామకరందము (తెలుగు)	350.00
2.	గీతామకరందము (ఇంగ్లీషు)	400.00
3.	యోగవాసిష్ఠ రత్నాకరము	300.00
4.	రామాయణ రత్నాకరము	300.00
5.	భాగవతరత్నాకరము	300.00
6.	భారతరత్నాకరము	300.00
7.	ఉపనిషద్రత్నాకరము	150.00
8.	మోక్షసాధనరహస్యము	100.00
9.	The Secret of Liberation	200.00
10.	Lecturers on Geetha	200.00
11.	గీతోపన్యాసములు	120.00
12.	బ్రహ్మచర్యవిజయము	60.00
13.	బ్రహ్మానంద వైభవము	30.00
14.	ఆత్మానుసంధానము	50.00
15.	అమృతబిందువులు	50.00
16.	స్థూలాక్షరి తాత్పర్యగీత	70.00
17.	పరమార్థ కథలు	120.00
18.	స్వాములవారి జీవిత చరిత్ర	100.00
19.	ఉపనిషత్ కథలు	40.00

గ్రంథములు కావలసినవారు పైకనిన ప్రకారము వీటి ధరలను ఎం.ఓ. ద్వారాగానీ, చెక్కు ద్వారా గాని, శ్రీ శుకబ్రహ్మాశ్రమము, శ్రీశుకబ్రహ్మాశ్రమము పోస్టు, శ్రీకాళహస్తి - 517 640 అను చిరునామాకు పంపగలరు. పోస్టేజి అదనము.

Regd.No. TRP / 123 / 2021 - 23   September 2021   Rs.10/-   R.No.8139/63

Date of Publication 26-08-2021, Permitted to post : 29th, 30th every month.

పూజ్యశ్రీ శివానంద సరస్వతి స్వామీజి మహరాజ్, ఋషీకేశ్.

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం